ఆలయాలకు.. గురుపౌర్ణమి శోభ

వాడవాడలా వేడుకలు ● భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు ● ప్రత్యేక పూజలు.. అన్నసమారాధనలు


శివరామకృష్ణ దేవస్థానంలో భక్తుల పూజలందుకుంటున్న సాయిబాబా

బాల్యంలోనే బీజం..

బాల్యంలో పలకా బలపం పట్టినప్పటి నుంచి మనం 'గురు బ్రహ్మ, గురు విష్ణుః గురు దేవో మహేశ్వరః గురు సాక్షాత్ పరబ్రహ్మ, తస్మై శ్రీ గురవే నమః' అనే శ్లోకం నేర్చుకుంటాం. మన సంస్కృతి తల్లిదండ్రుల తర్వాత గురువుకే పెద్ద పీట వేసింది. మాతృదేవోభవ! పితృదేవో భవ! ఆచార్య దేవోభవ! అనడం వెనుక ఆంతర్యం ఇదే. శ్రీరాముడు వశిష్టుని వద్ద, శ్రీకృష్ణుడు సాందీపుని వద్ద, పాండవులు ద్రోణాచార్యుని వద్ద విద్యనభ్యసించి భక్తిశ్రద్ధలతో వారిని పూజించారు. ఆది గురువైన వ్యాసుని జన్మ దినాన్ని మనం గురు పౌర్ణమిగా జరుపుకుంటాం. ద్వాపర యుగంలో పరాశరుడు, సత్యవతికి జన్మించిన వాడే వ్యాసుడు. ఆయనే విష్ణువు, విష్ణువే వ్యాసుడని అర్థం.

పూజా విధానం ఇలా..

గురు పౌర్ణమి రోజు ఉదయాన్నే స్నానం చేసి పసుపు కుంకుమలతో అలంకరించిన పీటపై లక్ష్మీనారాయణుల విగ్రహాలను అభిషేకించి ఎవరినైతే మనం కుల గురువుగా భావించి పూజిస్తామో ఆ విగ్రహాన్ని కూడా పీటపై ఉంచుకోవాలి. భక్తిశ్రద్ధలతో లక్ష్మీనారాయణుల అష్టోత్తర శతనామాలు చదువుకోవాలి. తర్వాత గురు పరంపరను, గురు శ్లోకాలను భక్తితో పఠించాలి. పసుపు రంగు గురువుకు సంకేతం కాబట్టి పూజలో వీలైనంత వరకు పసుపు రంగు పూలు, పండ్లు, ప్రసాదాలు సమర్పించాలి.

అల్లిపురం: గురు పౌర్ణమి సందర్భంగా గురువారం వాడవాడలా సాయిబాబా దేవాలయాల్లో ఘనంగా పూజలు నిర్వహించారు. అచ్చియ్యమ్మపేటలో వెలసిన షిర్డీ సాయి ధ్యాన మందిరంతో పాటు కుమ్మరి వీధిలో గల సాయిబాబా దేవాలయం, సాయిబాబా వీధిలో వెలసిన సాయిబాబా ఆలయంతో పాటు 32, 33, 34 వార్డుల్లో గల సాయిబాబా దేవాలయాల్లో తెల్లవారు జాము నుంచి విశేష అభిషేకాలు, ప్రత్యేక హారతులు నిర్వహించారు. భక్తులు స్వయంగా బాబాకు క్షీరాభిషేకం చేశారు. టూటౌన్ దరి శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన సాయిబాబాకు ఆలయ అర్చకుడు సాయిశర్మ ఆధ్వర్యంలో కుంబాభిషేకం, విశేష అభిషేకాలు నిర్వహించారు. సాయిబాబా వీధిలో వెలసిన సాయిబాబా దేవాలయంలో పీల వెంకట అప్పలనాయుడు పాల్గొని పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. బంగారుమెట్టలో వెలసిన సాయి దర్బార్‌లో సాయిబాబాకు విశేష పూజలు జరిపారు. అమ్మవారి వీధి, కొత్తమ్మవారి దేవాలయ ఆవరణలో వెలసిన సాయిబాబాకు భక్తులు విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం నారాయణ సేవ జరిపారు.


అచ్చియ్యమ్మపేట శ్రీ షిర్డీ సాయి దర్బార్‌లో బాబాకు పూజలు చేస్తున్న భక్తులు


అమ్మవారి వీధి సాయిబాబా దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఆంజనేయ స్వామి ఆలయంలో..

మహారాణిపేట: మెయిన్ రోడ్డులో కొలువై ఉన్న ఆంజనేయస్వామి వారి దేవాలయంలో ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని మన్యుసూక్త హోమం ఘనంగా జరిగింది. నరఘోష, శత్రు ఘోష, రుణబాధల నివారణకు ఈ హోమం నిర్వహిస్తారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన ఈ హోమంలో పాల్గొన్న భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసినట్లు ఆలయ ఈవో అల్లు జగన్నాథం తెలిపారు.


ఆంజనేయ స్వామి దేవాలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

ముట్నూరు జలజాక్షికి సత్కారం


జలజాక్షిని సత్కరిస్తున్న ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి ప్రతినిధులు

డాబాగార్డెన్స్: రామ్‌నగర్ మెయిన్‌రోడ్డులోని రాఘవేంద్రస్వామి మఠంలో వ్యాస మహర్షి జయంతి, గురుపౌర్ణమి సందర్భంగా ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితిచే ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసురాలు ముట్నూరు జలజాక్షిని సత్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న వెంకట్రావు జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. కర్ణాటక సంగీత వైభవానికి జలజాక్షి చేసిన సేవలను కొనియాడారు. ఆమె వద్ద సంగీతం నేర్చుకున్న ఎందరో శిష్యులు ఉత్తమంగా రాణిస్తున్నారని తెలిపారు. ఐవీఎల్ శాస్త్రీయ సంగీత సమితి శిష్య బృందం భక్తితో గురువందనం చేశారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ వెంకట్రావు, వైస్ చైర్మన్ కె.సుబ్రహ్మణ్యం, కార్యదర్శి పి.జగన్‌మోహన్‌రావు, కోశాధికారి ఎం.మధుబాబు, సంయుక్త కార్యదర్శి వి.మధుసూదనరావు, ఎం.నాగేశ్వరరావు, సంస్థ ప్రతినిధులు, శిష్యులు తదితరులు పాల్గొన్నారు.

రేణుక యల్లమ్మ ఆలయంలో అన్నసమారాధన


అమ్మవారి అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

అల్లిపురం: కెప్టెన్ రామారావు జంక్షన్‌లో వెలసిన రేణుక యల్లమ్మ అమ్మవారి ఆలయంలో ప్రతి గురువారం మాదిరి అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ గౌరవాధ్యక్షుడు పీల వెంకట అప్పలనాయుడు పర్యవేక్షణలో ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, కార్యదర్శి బొడ్డు పోలారావు, కమిటీ సభ్యులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమాన్ని చిన్నారి కె. ఆరాధ్య ప్రారంభించగా పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారి అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సలహాదారు బొడ్డేటి ప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

సాయి నామస్మరణతో మార్మోగిన ఆలయాలు..


సింగ్ హోటల్ జంక్షన్ ఓం సాయిబాబా ఆలయంలో బాబాకు అన్నాభిషేకం

డాబాగార్డెన్స్: నియోజకవర్గ పరిధిలో గల పలు బాబా ఆలయాల్లో గురు పౌర్ణమి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. పలు ఆలయాల్లో అన్నాభిషేకాలు నిర్వహించారు. ఆలయాలన్నీ సాయినాథుని స్మరణతో మార్మోగాయి. జీవీఎంసీ 31వ వార్డు సింగ్‌హోటల్ జంక్షన్‌లో వెలసిన శ్రీగణేష్ పార్వతి సమేత ఓంకార శివాలయం, ఓం సాయిబాబా ఆలయాల్లో కమిటీ ప్రతినిధులు బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అన్నాభిషేకం, ప్రత్యేక పూజలు, తిరువీధి ఉత్సవం జరిపారు. మధ్యాహ్నం వెయ్యి మంది భక్తులకు అన్నదానం చేశారు. పలువురు ప్రముఖులు బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు వడ్ల రామారావు, వరహా కృష్ణారావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాతనగరంలో..
జీవీఎంసీ 29వ వార్డు రామజోగిపేట, దండుబజార్ డౌన్ రోడ్డులో గురు పౌర్ణమిని పురస్కరించుకుని బాబా ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు జరిపారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. వన్‌టౌన్ పరిసర బాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. బురుజుపేట సాయిబాబా మందిరంలో తెల్లవారు జాము నుంచే పంచామృతాభిషేకాలు, విభూది అభిషేకం, క్షీరాభిషేకం, పూలాభిషేకం నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం 12 గంటలకు నక్షత్ర హారతి, చంద్ర హారతి, దివ్యజ్యోతులతో నీరాజనం, సాయంత్రం పల్లకీ సేవ, శోభాయాత్ర జరిపారు.

క్లుప్తంగా

సిరులతల్లికి పంచామృతాభిషేకం


పంచామృతాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 06081001 1006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు వేయండి మహాప్రభో


ప్రమాదాలకు నిలయంగా 38వ వార్డు యాసీన్ బాబా దర్గా ఏరియా

డాబాగార్డెన్స్: నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. చిన్న పిల్లలు ప్రమాదాల బారిన పడతున్నారు. యువకులు బైక్‌లపై రెచ్చిపోతున్నారు. వీధుల్లో వారి రైడింగ్‌ల కారణంగా ఎంతో మంది ఆవేదనకు గురవుతున్నారు. రెచ్చిపోతున్న యువత బైక్ రైడింగ్‌లకు స్పీడ్ బ్రేకర్ల ద్వారా ఫుల్‌స్టాప్ పెట్టాలంటూ గత ఏడాదిగా జీవీఎంసీ.. పోలీస్ సిబ్బంది వద్ద మొర పెట్టుకున్నా పట్టించుకున్న నాథుడే కరవవుతున్నాడు. సాక్షాత్తు జీవీఎంసీ జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా స్పందన కరవైందని 38వ వార్డు పరిధి యాసీన్ బాబా దర్గా ప్రాంత వాసి, సంఘ సేవకుడు డాక్టర్ రియాజ్ అహ్మద్ సాక్షి దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో యువకుల బైక్ రైడింగ్ కారణంగా అనేక మంది పిల్లలు పలు ప్రమాదాలకు గురయ్యారని, ఇటీవల ఓ బాలుడిని ఓ యువకుడు బైక్ డ్రైవింగ్ చేసి ఢీకొట్టడంతో, ఆ బాలుడు చెయ్యి విరిగి మంచాన పట్టాడని, ఇలాంటి ప్రమాదాలు తరచూ సంభవిస్తున్నా అధికారులు స్పందించడం లేదని డాక్టర్ రియాజ్ అహ్మద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లు వేయాలని కోరారు.

సత్యకుమారికి ఉమెన్ అచీవర్స్ అవార్డు


అవార్డు అందుకుంటున్న సత్యకుమారి

డాబాగార్డెన్స్: సౌత్ ఇండియా ఉమెన్ అచీవర్స్ అవార్డ్–2025లో చేంజ్ మేకర్ విభాగంలో విశాఖకు చెందిన ఉన్నవ వెంకట సత్య కుమారి పురస్కారానికి ఎంపికయ్యారు. గురువారం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ అవార్డుల కార్యక్రమం చెన్నైలోని ఎంసీసీ స్కూల్ ఆడిటోరియంలో ఈనెల 9న జరిగిందన్నారు. ట్విల్ మ్యాగజైన్ వ్యవస్థాపకుడు దీపక్ టాటర్ జైన్ నాయకత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారని తెలిపారు. సేవా, మహిళల సాధికారత రంగాల్లో విశేష కృషి చేసిన వారికి ఈ పురస్కారాలు అందిస్తారని వెంకట సత్యకుమారి తెలిపారు.

'రెడ్‌క్రాస్' మురళికి సత్కారం


మురళిని సత్కరిస్తున్న జైభీమ్ సంస్థ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: మానసిక రోగులు, అనాథలను అక్కున చేర్చుకోవడం, వారిని నిరాశ్రయుల ఆశ్రమానికి తరలించే రెడ్‌క్రాస్ మురళిని జైభీమ్ సంస్థ గురువారం సత్కరించింది. మురళి సేవా కార్యక్రమాలతో పాటు రక్తదాన శిబిరాలు నిర్వహిస్తుంటారు. తాను చేసిన సేవలకు గాను రెడ్‌క్రాస్ సొసైటీ వార్షికోత్సవంలో గవర్నర్ అబ్దుల్ సయ్యద్ నజీర్ చేతుల మీదుగా అవార్డు పొందిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో జైభీమ్ సంస్థ కన్వీనర్ కోన ప్రకాష్, సభ్యులు వెంకట్, జయరాజ్, రాము, శివ తదితరులు పాల్గొన్నారు.

జగన్ అంటే బాబుకు వణుకు

- రైతుల కోసం పోరాడే హక్కు లేదా?
- మామిడి రైతులకు మద్దతు ఇవ్వడం కూడా నేరమేనా?
- మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: జగన్‌మోహన్ రెడ్డి అన్నా.. వైఎస్సార్‌సీపీ అన్నా చంద్రబాబుకు వణుకు పుడుతోందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ ఎద్దేవా చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి ఓ శక్తి అని.. ఆయనను ఎవరూ ఆపలేరన్నారు. కూటమి ప్రభుత్వం జగన్‌మోహన్‌రెడ్డిని ఆపాలని చూస్తే పడి లేచిన కెరటంలా దూసుకొస్తారని వాసుపల్లి తెలిపారు. చిత్తూరు జిల్లాలో రోడ్డున పడ్డ మామిడి రైతులకు మద్దతు తెలిపేందుకు వెళ్లిన జగన్‌మోహన్‌రెడ్డిపై కుతంత్ర రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. మామిడి పండ్లు కేజీ రూ.2 ధర పట్టిక పెట్టి కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలు ఎండగడుతూ ఆశీల్‌మెట్టలోని తన కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేష్‌కు వాసుపల్లి మాస్ వార్నింగ్ ఇచ్చారు. తోతాపురి మామిడికాయలకు గిట్టుబాటు ధర రెండు రూపాయలు ఇస్తే రైతులు ఎలా బతకాలని ప్రశ్నించారు. వ్యవసాయం దండగా అని చెప్పిన చంద్రబాబు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండడం బాధాకరమన్నారు. రైతులు, పేదలకు అండగా నిలబడే జగనన్న మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని వాసుపల్లి స్పష్టం చేశారు. సమావేశంలో పార్టీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ, పార్టీ జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్, ఎరిన్నమాంబ ఆలయ చైర్మన్ లండా రమణ, జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి రామానంద్, పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు, నాయకులు ఈతలపాక విజయ్, దశమంతుల చిన్ని, పద్మనాభ అమ్మాజీ, దూడ అప్పారావు, భీశెట్టి ప్రసాద్, దశమంతుల మాణిక్యాలరావు, మహ్మద్ షకీల్, మహ్మద్ షరీఫ్, బుల్లెట్ రవి, కోరాడ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అంటేనే మోసం


మాట్లాడుతున్న వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: చంద్రబాబు అంటేనే మోసం అని మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ దుయ్యబట్టారు. నియోజకవర్గం 27వ వార్డు దొండపర్తి రామాలయం వద్ద ఆ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి నేతృత్వంలో గురువారం 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. పాల్గొన్న వాసుపల్లి మాట్లాడుతూ తల్లికి వందనం, 50 ఏళ్లకే పెన్షన్, వితంతు పింఛన్‌తో పాటు పలు పథకాల్లో పేదలను అనర్హులను చేసి ఎగ్గొట్టారని మండిపడ్డారు. వలంటీర్లకు రూ.10 వేలు జీతం చెల్లిస్తామని ఇప్పుడు లక్షలాది మంది యువత ఉద్యోగాలు తొలగించారని విమర్శించారు. చంద్రబాబును నమ్మి ఓటు వేయడం వల్ల రాష్ట్రానికి జరుగుతున్న నష్టంపై ప్రజలకు వివరించే విషయమై జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్, 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్‌కుమార్ జైన్, కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ షరీఫ్, నియోజకవర్గ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా నీలమ్మ వేపచెట్టు అమ్మవారు


కాయగూరలు, ఆకుకూరలు, పండ్లతో అలంకరించిన నీలమ్మ వేపచెట్టు అమ్మవారి ఆలయం

అల్లిపురం: ఆషాఢ శుద్ధ పౌర్ణమి సందర్భంగా అస్సాం గార్డెన్స్‌లో వెలసిన నీలమ్మ వేపచెట్టు అమ్మవారు గురువారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి తెల్లవారి జాము నుంచి ఆలయ అర్చకుడు జోగారావుశర్మ ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహానికి విశేష అభిషేకాలు చేపట్టారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఆకుకూరలు, కాయగూరలు, పనస పండ్లు, పైనాపిల్, మామిడి పండ్లతో విశేషంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. భక్తులు స్వయంగా అమ్మవారికి పూజలు చేశారు. పౌర్ణమి సందర్భంగా అమ్మవారి శాకాన్నం ప్రత్యేక ప్రసాదంగా ఆలయ వర్గాలు భక్తులకు అందజేశారు.

కొత్తమ్మవారికి కూరగాయలతో అలంకరణ..
పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారి వీధిలో వెలసిన కొత్తమ్మవారిని ఆలయ వర్గం కాయగూరలతో విశేషంగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయ అర్చకులు విశేష పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన


వైద్య పరీక్షల అనంతరం ఉచితంగా మందులు అందజేస్తున్న డాక్టర్ సూర్యతేజ

డాబాగార్డెన్స్: స్నేహ సంధ్య ఏజీకేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పాతనగరంలోని స్వామి వివేకానంద సంస్థలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రతి నెలా రెండో గురువారం మాదిరి నిర్వహించిన ఈ శిబిరంలో అధిక సంఖ్యలో పాతనగరం స్థానికులు పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ సూర్యతేజ పర్యవేక్షణలో తనిఖీలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నాయని, క్రమం తప్పకుండా మందులు వేసుకుని, సమయానికి ఆహారం తీసుకోవాలని, వ్యాయామం చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి కిమ్స్ హాస్పటల్ ఆధ్వర్యంలో గుండెకి సంబంధించిన పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఈసీజీ, ఎకో పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని, స్థానికులు ఈ వైద్య సేవలు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పుండరీకాక్షయ్య, ప్రసాద్ నాయుడు, కమల ప్రియ, సుమతి, సాయి తదితర వైద్య బృందం పాల్గొంది.

రాజకీయ సమావేశంలా పేరెంట్, టీచర్ మీటింగ్


దండుబజార్ స్కూల్లో నిర్వహించిన పేరెంట్ టీచర్ మీటింగ్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, నాయకులు


ఎంజీఎం హై స్కూల్‌లో తల్లులకు పాదాభివందనం చేస్తున్న విద్యార్థులు

డాబాగార్డెన్స్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో నిర్వహించిన పేరెంట్ టీచర్ మీటింగ్ రాజకీయ సమావేశంగా మారింది. అసలు పేరెంట్ టీచర్ మీటింగ్ అంటే.. విద్యార్థులు పాఠశాల/కళాశాలలో ఎలా చదువుతున్నారు? క్రమశిక్షణ, ఉపాధ్యాయులు/అధ్యాపకులు, తోటి విద్యార్థులతో ఎలా నడుస్తున్నాడు? ఉపాధ్యాయులు పాఠాలు ఎలా బోధిస్తున్నారు వంటి అంశాల గురించి పేరెంట్.. ఉపాధ్యాయుడి మధ్య జరిగే ప్రత్యేక కార్యక్రమం అని అందరికీ తెలిసిందే. కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందనడానికి గురువారం నియోజకవర్గ పరిధి పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో తల్లిదండ్రులు.. అధ్యాపకులు పేరిట నిర్వహించిన ఆత్మీయ సమావేశమే నిదర్శనం.

పాఠశాలల్లో చోటా నాయకుల హంగామా..
వార్డు కార్పొరేటర్‌తో పాటు వార్డు.. గల్లీ నాయకులు పేరెంట్ టీచర్ మీటింగ్‌లో హంగామా చేశారు. జీవీఎంసీ 30వ వార్డు కార్పొరేటర్ ఎంత చదువుకున్నారో తెలియదు గానీ.. ఆ వార్డు పరిధి జీవీఎంసీ దండుబజార్ పాఠశాలలో నిర్వహించిన పేరెంట్ టీచర్ మీటింగ్‌లో ఆమె ప్రధాన వక్తగా పాల్గొన్నారు. ముఖ్య వక్తగా ఆమె పిల్లలు, పేరెంట్స్‌కు.. ఉపాధ్యాయులకు చెప్పేదేంటో? ఈ విషయమై ఆ వార్డు ప్రజలే చెవులు కొరుక్కుంటున్నారు. ఇలా ఈ ఒక్క పాఠశాలే కాదు.. నియోజకవర్గ పరిధిలో ఉన్న పలు పాఠశాలల దుస్థితి కూడా అంతే.

అట్టహాసంగా పేరెంట్, టీచర్ మీటింగ్
అల్లిపురం: డాబాగార్డెన్స్‌లో గల మహాత్మాగాంధీ మున్సిపల్ హై స్కూల్, రైల్వే క్వార్టర్స్‌లో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అల్లిపురం మెయిన్‌రోడ్డులో గల మోడల్ స్కూల్, అచ్చియ్యమ్మపేటలో గల జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు తాడు లాగే ఆట, లెమన్ అండ్ స్పూన్ వంటి ఆటలు ఆడించారు. అనంతరం విద్యార్థులతో తల్లులకు పాదాభివందనం చేయించారు. ఎంజీఎం హై స్కూల్ కార్యక్రమంలో 33వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్‌వీవీఎస్ నాగభూషణం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. రైల్వే క్వార్టర్స్‌లో గల ప్రభుత్వ హై స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఆట పాటలు నిర్వహించారు. పాఠశాల పూర్వ విద్యార్థిని డబ్బీరు రమామణి, ఎల్.ప్రసాదరావు దంపతులు ముగ్గురు విద్యార్థినులకు డబ్బీరు సుగుణ ఎక్స్‌లెన్స్ అవార్డుల పేరిట స్కాలర్‌షిప్‌లు అందజేశారు. పడాల రత్నాలు అకడమిక్ ఎక్స్‌లెన్స్ స్కాలర్‌షిప్‌లు ముగ్గురు బాలురికి ఏయూ ప్రొఫెసర్ పి.విశ్వనాథం చేతుల మీదుగా అందజేశారు. 2024–25లో ఎస్ఎస్‌సీలో ప్రతిభ కనబరిచిన జి.కార్తికేయ శర్మ, ఎం. దేవహర్ష, పి.హేమంత్, వి.అక్షయ, సీహెచ్ శిరీష, వై.స్వాతి తదితరులకు నగదు బహుమతితో పాటు మెడల్, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.మీనాక్షి, పూర్వ విద్యార్థులు కాకర శ్రీను, డి.హరనాథ్, దత్తి ప్రసాద్, డి.శారద, టీచర్ ప్రసన్నకుమార్, డాక్టర్ ఎన్. సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

గాజువాక ఎమ్మెల్యే పల్లా? మురళీకృష్ణా?

- టీడీపీ కార్యకర్తలంతా మురళీకృష్ణ మాటే వినాలంట..
- ఎమ్మార్వో శ్రీవల్లి పాత్రపైనా అనుమానాలు
- డమ్మీలుగా జోన్–6, ఎస్‌డీసీ అధికారులు
- తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్

డాబాగార్డెన్స్ : గాజువాక ఎమ్మెల్యే ఎవరనే అనుమానం ప్రజల్లో కలుగుతోందని తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గాజువాకలో మురళీకృష్ణ అనే వ్యక్తి అరాచకాలు చూసి ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎక్కడ చూసినా సెటిల్‌మెంట్లు, భూకబ్జాలు కనిపిస్తున్నాయని అన్నారు. ఎవరైనా మురళీకృష్ణ మాటే వినాలని పల్లా శ్రీనివాస్ హుకుం జారీ చేశారనే సమాచారం ఉందన్నారు. గాజువాకలో అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ భూముల కబ్జాలు అడ్డుకునే వారే లేరని, కనీసం అధికారులు చర్యలు తీసుకోవడానికి కూడా స్థానిక ఎమ్మెల్యే పల్లా ఒప్పుకోవడం లేదన్నారు. ఇదిలా ఉండగా.. మురళీకృష్ణ చేసిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయని, టీటీడీ బ్రేక్ దర్శనం టికెట్లు ఎవరికిచ్చారో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరా తీయాలన్నారు. కోర్టు పరిధిలో ఉన్న బారిక, ఇనాం భూములను వెబ్‌ల్యాండ్‌లో ఎక్కించేశారని, 70వ వార్డులోని సర్వే నంబరు 67లో గల 1-8లో 8 ఎకరాలు వెబ్‌ల్యాండ్‌లో ఎక్కించారన్నారు. ఈ భూమికి సంబంధించి రైతు కుటుంబాలు కోర్టులో కేసు వేశాయని తెలిపారు. దీనిపై ఎటువంటి తీర్పు రాకుండానే ఆన్‌లైన్‌లోకి ఎక్కించేశారని పేర్కొన్నారు. ఎమ్మార్వో శ్రీవల్లి హయాంలోనే మురళీకృష్ణ ఆమెను అడ్డం పెట్టుకుని, ఈ పనులన్నీ చేయించారని తెలిపారు.